# స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సన్మానం


స్పీకర్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ బృందం

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ బృందం ఘనంగా సన్మానించింది. క్లబ్ అధ్యక్షుడు లయన్ జోగిందర్ సింగ్ ముజ్రాల్, కార్యదర్శి లయన్ పి.అమరేందర్‌రెడ్డి, సర్వీస్ చైర్‌పర్సన్ లయన్ బాలాజీ సింగ్ ఠాకూర్, డైరెక్టర్ లయన్ రవిశంకర్, సరోజిత్ సింగ్ అరోరాలు స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ తరఫున పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. తమ సభ్యులు స్పీకర్‌గా ఎన్నికై నందుకు తమకెంతో ఆనందంగా ఉందన్నారు. పేద, బడుగు వర్గాలతో పాటు మురికివాడలు, బస్తీలలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు నిరంతరం సమాజ సేవ అందిస్తున్నట్లు వారు వెల్లడించారు.

# హౌసింగ్ సొసైటీకి రూ.20 కోట్లు మంజూరు చేయాలి


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.స్వామిగౌడ్

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ మ్యుచివల్లి హౌసింగ్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు, శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, సొసైటీ కార్యదర్శి ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని, ఇతర నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్, ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీకి ప్రత్యేకంగా రూ.20 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ సొసైటీ 2వ ఫేస్ రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు వెల్లడించారు. తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ మ్యూచివల్లి హౌసింగ్ కోఆపరేటీ సొసైటీ ఆధ్వర్యంలో ఉద్యోగులందరికీ అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



రాజేంద్రనగర్: ఆశ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డీఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని ఒక వైపు ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఆచరణలో మాత్రం పెట్టడం లేదన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఈ విషయమై పలుమార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని లేకుంటే అన్ని పీహెచ్‌సీ సెంటర్లలో విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, ఆశ వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

## బిల్డింగ్‌పై నుంచి పడి యువకుడి మృతి

అత్తాపూర్: బిల్డింగ్ పైనుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ మన్నాన్ (22) 15 రోజుల క్రితం ఉపాధి కోసం సులేమాన్‌నగర్‌కు వలస వచ్చి డైమండ్ స్కూల్ వెనుకాల ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మన్నాన్‌ను సులేమాన్ నగర్‌లోని 232 పిల్లర్ నంబర్ దగ్గర పని చేసేందుకు ఖలీల్ ఉర్ రెహమాన్ తీసుకెళ్లాడు. సాయంత్రం పని అయిపోయిన తర్వాత నాలుగో అంతస్తులో సిమెంట్ మాల్ కింద పడిపోవడంతో ఎత్తుతున్నాడు. ఈ క్రమంలో మన్నాన్ ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స కోసం మైత్రి ఆసుపత్రికి ..అక్కడి నుంచి ఉస్మానియా దవాఖానకు తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# నిత్యం ట్రాఫిక్ జామ్


గోల్కొండ బంజారి దర్వాజ వద్ద ట్రాఫిక్ జామ్

గోల్కొండ: గోల్కొండ బంజారి దర్వాజ వద్ద ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. గోల్కొండ కోటకు బంజారి దర్వాజ గుండా ప్రతినిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. అంతేకాకుండా షేక్‌పేట్, నార్సింగి, పుప్పాలగూడ, షేక్‌పేట్‌నాలా, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల నుంచి గోల్కొండ వెళ్లే వారు ఈ దర్వాజ గుండానే వెళతారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పాయింట్ ఉన్నా ట్రాఫిక్ జామ్ కావడం, వాహనాదారుల మధ్య గొడవలు జరగడం పరిపాటిగా మారింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్వాజకు ఇరువైపుల వందల సంఖ్యలో వాహనాలు నిలిచి ఉంటున్నాయి. కొన్ని వాహనాలను గోల్ఫ్ కోర్సు రోడ్డు నుంచి గోల్కొండ పోలీస్‌స్టేషన్ నయాకీలా వైపు మళ్లించాలని పలువురు కోరుతున్నారు. దీన్ని వల్ల బంజారి దర్వాజ వద్ద ట్రాఫిక్ జామ్ తగ్గుతుందని పలువురు అంటున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. సోమవారం తలాబ్‌కట్టా షాజహాన్ ఫంక్షన్ హాల్‌లో చార్మినార్ మండల కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై 150 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు మరిన్ని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యాక్రమంలో తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, పత్తర్‌గట్టీ డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్‌ఖాద్రీ, చార్మినార్ తహసీల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'విజ్ఞానోత్సవ్'

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో నిర్వహణ

రాయదుర్గం: అట్టహాసంగా నిర్వహించిన 'విజ్ఞానోత్సవ్' కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప చేసింది. హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో సోమవారం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, జూనియర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'విజ్ఞానోత్సవ్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ మిరాజ్ ఫాతిమా మాట్లాడుతూ మన విజ్ఞానాన్ని మన దేశ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో అన్ని రంగాలలో భారత్ తనకంటూ ప్రత్యేకతను సాధిస్తూ వస్తోందన్నారు. అంతకుముందు క్యాంపస్‌లోని పలు ల్యాబ్‌లను పరిశీలించారు. విజేతలకు బహుమతులను అందించారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

# అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్


హకీంపేట్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను డీఎంసీకి వివరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన బల్దియా డీఎంసీ శశిరేఖ, ఇతర అధికారులతో కలిసి కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టోలిచౌకి, కార్వాన్, నానల్‌నగర్ డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలతో పాటు పూర్తి కాని అభివృద్ధి పనుల గురించి వివరించారు. బుల్కాపూర్ నాలా వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని ఆమె దృష్టికి తెచ్చారు. బుల్కాపూర్ నాలాకు పటిష్టమైన ప్రహరీ లేకపోవడం వల్ల నాలాలో చెత్త డంపింగ్ జరుగుతుందన్నారు. అంతేకాకుండా నాలా పూడికతీత పనులు కూడా జరగకపోవడం వల్ల మురికి నీరు ముందుకు కదలడం లేదని ఆయన పేర్కొన్నారు. నాలా పూడికతీత కోసం తాను ఎన్నో మార్లు విజ్ఞప్తులు చేసిన కూడా పూడికతీత పనులు సవ్యంగా సాగడం లేదన్నారు. అనంతరం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లోని రోడ్లను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆమెకు వివరించారు. పురాతనమైన ఈ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. హకీంపేట్ నుంచి జూబ్లీహిల్స్ వెళ్లే రోడ్డు సైతం అభివృద్ధి చేయాలన్నారు. హకీంపేట్ గుండా జూబ్లీహిల్స్‌కు వెళ్లే రోడ్డు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ చిక్కులు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్డు అభివృద్ధి జరగడం లేదని ఆయన అన్నారు. ఎండీ లైన్స్, తూమ్స్ రోడ్‌లో జరుగుతున్న పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నత్తనడకన సాగుతున్న ఈ పనుల వల్ల వాహనాదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్లలో వీడీసీసీ రోడ్లకు తాను పంపిన ప్రతిపాదనలకు వెంటనే ఆమోదించి పనులను ప్రారంభించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బల్దియా చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, ఎంటమాలజీ ఎస్‌ఈ రజనీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్‌తో పాటు జలమండలి డీజీఎం ఖాజా జవహర్ ఆలీ, విద్యుత్ శాఖ అధికారులు, మజ్లిస్ నాయకులు తదితరులున్నారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధం ఏమాయే..?

చార్మినార్: 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్ల వినియోగ నిషేధం పాతబస్తీలో ఆశించిన ఫలితాలివ్వడం లేదు. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్ల వినియోగ నిషేధం అమల్లోకి తెచ్చినప్పటికీ.. పాత బస్తీలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులు, వ్యాపారస్తులు ఇంకా పాత పద్ధతిలోనే తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఎక్కడా జీహెచ్‌ఎంసీ నిబంధనలు అమలు కావడం లేదు. ఏళ్లు గడుస్తున్నా..కొంతమంది వ్యాపారులు ఇంకా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం లేదు. ఎప్పటిలాగే పాత ప్లాస్టిక్ కవర్లనే విని యోగిస్తున్నారు. చార్మినార్, చౌక్, ఖిల్వత్, లాడ్‌బజార్, శాలిబండ, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌస్, మదీనా, చార్‌కమాన్, మీరాలంమండి, లాల్‌దర్వాజా మోడ్ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను విరివిగా వినియోగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ 2011 నుంచి అమల్లోకి తెచ్చిన 50 మైక్రాన్ల లోపు వినియోగ నిషేధాన్ని సంబంధిత అధికారులు గాలికొదిలేశారు.

## శుభాకాంక్షలు



నాంపల్లి: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా నియమితులైన హనుమంతరావును ఆ శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఐ అండ్ పీఆర్ కార్యాలయంలో డాక్టర్ ఎస్.ఎస్.కె.రాజు నేతృత్వంలో పలువురు ఉద్యోగులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

## ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు



నాంపల్లి: ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. మొదటి రోజు 76 హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరు అయ్యారు. వైద్య పరీక్షల కార్యక్రమానికి మధ్య మండలం డీసీపీ హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పాల్గొన్నారు. హబీబ్‌నగర్ పోలీసులు వైద్య పరీక్షల ఏర్పాట్లను పూర్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


టీఎన్‌జీఓ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందని టీఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటికీ దశలవారీగా పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యాదాతలు ముందుకు రావాలి


టీమ్‌సంభవ ప్రతినిధులతో డాక్టర్ శోభన

గన్‌ఫౌండ్రీ: నిరుపేద విద్యార్థినులకు విద్యా ప్రదానం కోసం దాతలు సహకరించాలని సరోజినీనాయుడు వనితా మహా విద్యాలయ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శోభన అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని వనితా మహా విద్యాలయ కళాశాలతో టీమ్ సంభవ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆర్థికంగా బలహీనంగా ఉన్న విద్యార్థినులకు మద్దతను ఇచ్చేందుకు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. టీమ్‌సంభవ వ్యవస్థాపకుడు సద్గుర్‌నాథ్ మాట్లాడుతూ..ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవపై వివరించారు. కన్‌స్ట్రక్షన్ స్పెషాలిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, టీమ్‌సంభవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


సమావేశంలో కార్డులను చూపుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని శాసన సభ ఆవరణలో ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్ చొల్లేటి కృష్ణమాచార్యులు కోరారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి పోస్టు కార్డులను పంపి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రొఫెసర్ జయశంకర్ బతికి ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరితపించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, కోశాధికారి రాఘుఫణి రవీంద్రాచారి, మహిళా విభాగం అధ్యక్షురాలు చిల్కూరు లక్ష్మీ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## గౌలిపురా కబేళాను పరిశీలించిన జోనల్ కమిషనర్



గౌలిపురా: గౌలిపురా కబేళా అంశంపై వెటర్నరీ అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. సోమవారం గౌలిపురా డివిజన్‌లోని కబేళాను ఆయన మొదటిసారిగా సందర్శించి కబేళాకు సంబంధించిన సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మేకల మండలిని స్థానిక ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావాలని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ఆరె కటిక సంఘం సభ్యులతో జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ఆధునీకరించిన కబేళాను విషయమై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, నాయకులు ధీరజ్ లాల్, శ్రీనివాస్‌తో పాటు జీహెచ్‌ఎంసీ ప్రధాన వెటర్నరీ అధికారి డాక్టర్ మహ్మద్ అబ్దుల్ వకీల్, చార్మినార్ జోన్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పలువులు అధికారులు పాల్గొన్నారు.

# కలహాలతోనే కాపురాలు విచ్ఛిన్నం


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: అపోహలు, కలహాలతో పచ్చని సంసారాలు విచ్ఛిన్నమవుతున్నాయని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆయన కుటుంబం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులు కలిసి ఉంటేనే సుఖంగా జీవించగలుగుతారని ఆయన అన్నారు. పెళ్లి చేసుకొని కొందరు విడిగా ఉండేందుకు తమ కుటుంబ పెద్దలతో అనవసరంగా కలహాలకు దిగుతారని ఆయన అన్నారు. కుటుంబం నుంచి విడిపోవడం మంచిదే కానీ వివాదాలు సృష్టించుకోవడం మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ పెద్దలు తమ కోడలిని కన్న కూతురిలాగా చూసుకుంటామని తమ మధ్య ఉన్న కోపతాపాలను మరచి ఇంటికి తిరిగి వెళ్లారు.

## జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెస్ట్ సౌత్ జోన్ అదనపు డీసీపీ అథరుద్దీన్

గోల్కొండ: నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని ఎంపీ గార్డెన్‌లో జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. యూనైటెడ్ వే, డిబిఎస్ టెక్ వారు నిర్వహించిన ఈ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఎన్నో మెగా జాబ్ మేళాలు నిర్వహించడం జరిగిందన్నారు. వెస్ట్ సౌత్ జోన్ అదనపు డీసీపీ అథరుద్దీన్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ సైతం జాబ్ మేళాలను నిర్వహిస్తుందన్నారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జిల్లా బీఎస్‌పీ అధ్యక్షుడిగా రాంచరణ్ దాస్



చార్మినార్: హైదరాబాద్ జిల్లా బీఎస్‌పీ అధ్యక్షుడిగా పాతబస్తీకి చెందిన మూల రాంచరణ్ దాస్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు చార్మినార్ నియోజకవర్గం అధ్యక్షుడిగా, హైదరాబాద్ జిల్లా కోశాధికారిగా పని చేసిన ఆయన ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికలలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి బీఎస్‌పీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఎగ్జిబిషన్‌లో బాలీవుడ్ సింగర్ సందడి


ఎగ్జిబిషన్‌లో సందడి చేసిన బాలీవుడ్ సింగర్ జావేద్ అలీ

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బాలీవుడ్ సింగర్ సందడి చేశారు. తన గీతాలాపనతో సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. పలు విధాల గీతాలు పాడుతూ అందరిని అలరించారు. సొసైటీ సభ్యులు, సందర్శకులు జావేద్ గీతాలతో సంబరపడిపోయారు. ఈ సందర్భంగా గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ కన్వీనర్ ముఖీర్ హైదర్, అడ్వైజర్ బి.ప్రభాశంకర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్ జావేద్ అలీని ఘనంగా సత్కరించారు.

## ఎస్సీ వర్గీకరణతో అందరికీ ప్రయోజనం


షేగి శ్రీనివాస్ మాదిగను సత్కరించిన పూజలోల్ల రవి మాదిగ తదితరులు

అబిడ్స్: ఎస్సీ వర్గీకరణతో అందరికీ ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు పూజలోల్ల రవి మాదిగ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం త్వరలోనే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన అన్నారు. గోషామహల్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు షేగి శ్రీనివాస్ మాదిగను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూజలోల్ల రవి మాదిగ మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ త్వరలోనే పూర్తయి అందరి ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగేందర్ ఉపాధ్యాయ, ఏలే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి బేగంబజార్, పురాణాపూల్ ఓవర్ హెడ్, దత్తాత్రేయనగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని బేగంబజార్ ఛత్రి, సెవెన్ హెవన్ హోటల్, కంటి ఆస్పత్రి లేన్, జుమ్మేరాత్ బజార్, ఎంసీహెచ్ కార్యాలయం, బాపూజినగర్, చాకొలెట్ ఫ్యాక్టరీ, దత్తాత్రేయ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వి ఆసిఫ్‌నగర్, దత్తాత్రేయనగర్ ఓవర్ హెడ్, ఫీల్‌ఖానా విద్యుత్ ఫీడర్ పరిధిలోని మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, అఫ్జల్‌సాగర్, మాంగర్‌బస్తీ, ఫీల్‌ఖానా, కుమ్మర్‌వాడి, వెంకటమ్మ తోట, యాదవ్‌బస్తీ, బైలెక్, అజీజ్‌ప్లాజా, రంగాచారి, ప్రేమ్ ప్లాజా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

**మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..**

లంగర్‌హౌస్: మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ ఆసిఫ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మనాభనగర్, కరోల్‌బాగ్, లక్ష్మీనగర్, సప్తగిరి కాలనీ, నానల్‌నగర్ ఎక్స్ రోడ్, రాఘవ పాఠశాల, పీ అండ్ టీ కాలనీ, దిల్‌షాద్‌నగర్, అయోధ్యనగర్, ఎస్‌బీఐ కాలనీ, అరవింద్ కంటి ఆస్పత్రి, సంతోష్‌నగర్, మిలాన్ గార్డెన్, సప్తగిరి కాలనీ, ఖాదర్‌బాగ్, రాక్‌హిల్స్ కాలనీ, బహదూర్‌జంగ్ కాలనీ, సర్దార్ బాగ్, జ్యోతి నగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 32/11కెవి లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెస్టెన్ ప్లాజా, కట్టెల బస్తీ, మినీ ఓయూ కాలనీ, గ్యాస్ గోడౌన్, మారుతినగర్, ఓం నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత



గోల్కొండ: ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆసిఫ్‌నగర్ ఎమ్మార్వో జ్యోతి అన్నారు. సోమవారం ఆసిఫ్‌నగర్ మండలంలోని గుడిమల్కాపూర్‌లో 300 గజాల స్థలంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేశారు.

## 'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

శాలిబండ: గృహ జ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచిత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మీరాలం ఏడీఈ వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు మీ ఇంటి వద్దకు వచ్చే విద్యుత్ సిబ్బందికి మీ రేషన్ కార్డు, ఆధార్ కార్డులను చూపించి సర్వీస్ నెంబర్ కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

## ఏకగ్రీవ ఎన్నిక

అఫ్జల్‌గంజ్: తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ వై. తిమ్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తిమ్మారెడ్డిని కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.


డాక్టర్ తిమ్మారెడ్డి అభినందిస్తున్న ప్రతినిధులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684